# గ్రూప్ 1 మెయిన్స్‌పై దోబూచులాట

## ఏ పోస్టులెన్నో చెప్పని ఏపీపీఎస్సీ

- ఆందోళనకు గురవుతున్న నిరుద్యోగులు
- 2011 ప్రిలిమ్స్‌లో చిచ్చురేపిన ప్రశ్నల తొలగింపు
- ఏ ప్రాతిపదికన తొలగించారో చెప్పని వైనం
- అనర్హులవనున్న వందలాది మంది అభ్యర్థులు
- క్యారీఫార్వర్డ్ పోస్టులపై స్పష్టత కరువు
- మళ్లీ వివాదాలు తప్పవంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2011 గ్రూప్ 1 పోస్టులకు మెయిన్స్ పరీక్ష తిరిగి నిర్వహించడంలో ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) తీరుపై అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోతోంది. పోస్టుల వివరాలు, రోస్టర్ వెల్లడించకుండా పరీక్షలకు సిద్ధమవుతుండడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏపీపీఎస్సీ ఇదివరకు చేసిన తప్పిదాలతో ఐదేళ్ల కాలం వృథా అయ్యిందని, ఇప్పుడూ కమిషన్ తీరు అదే విధంగా ఉందని మండిపడుతున్నారు. ఏపీపీఎస్సీ కొత్తగా ప్రకటించిన అర్హుల జాబితాలో తప్పులున్నట్లు ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. ఏపీపీఎస్సీ పొరపాటు వల్ల ఆరు ప్రశ్నలను తొలగించడంతో గతంలో వాటికి సమాధానాలు గుర్తించి కటాఫ్‌కి సమీపంలో ఉన్న 854 మంది అభ్యర్థులు, ఇంటర్వ్యూలకు హాజరైనవారూ ప్రస్తుతం మెయిన్స్‌కు అర్హత కోల్పోయారు. మరోపక్క అప్పట్లో పరీక్షలకు హాజరుకాని వారి నంబర్లు తాజా జాబితాలో ఉండడం గమనార్హం.

### ఏ కమిటీ నివేదిక మేరకు ప్రశ్నలు తొలగించారో?

గతంలో జరిగిన 2011 గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రంలో 13 ప్రశ్నలు తప్పుడు సమాధానాలతో ఉన్నాయన్న ఆరోపణలు రావడంతో ఏపీపీఎస్సీ కమిటీ వేసి 7 ప్రశ్నలు తొలగించి మెయిన్స్‌కు జాబితా ప్రకటించింది. అయితే మిగిలిన 6 ప్రశ్నల సమాధానాలు కూడా సందేహాస్పదంగా ఉన్నాయని కొందరు హైకోర్టుకు వెళ్లగా ఆ ప్రశ్నలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు (యూపీఎస్సీ) పంపి నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం గతంలో ఆదేశించింది. తాను చేసిందే సరైనదని పేర్కొంటూ ఏపీపీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం ఆ ప్రశ్నలు తప్పని తేలితే వాటిని తొలగించి 144 ప్రశ్నలతో తాజా జాబితా తయారుచేసి మళ్లీ మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని సుప్రీం తీర్పు ఇచ్చింది. అయితే ఏ కమిటీ నివేదిక మేరకు, ఏ ప్రాతిపదికన ఆ ప్రశ్నలు తొలగించిందో ఎవరికీ చెప్పని ఏపీపీఎస్సీ.. సుప్రీం తీర్పు మేరకు ఆరు ప్రశ్నలను తొలగించి 144 ప్రశ్నలతో కొత్త జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాతో వందలాది మంది అవకాశం కోల్పోతుండడంతో ఆరు ప్రశ్నలను ఏ కమిటీ నివేదిక ప్రకారం తీసేశారో తెలియచేయాలంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

### పోస్టుల, రోస్టర్ ప్రకటించకుండానే పరీక్షా

ఇదిలాఉండగా 2011 గ్రూప్1లోని 314(312 ప్లస్ 2) పోస్టుల్లో ఏపీ కోటా కింద వచ్చిన 173(172 ప్లస్1) పోస్టులకు మెయిన్స్‌ను తిరిగి నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. అయితే ఆ 173 పోస్టుల వివరాలను, రోస్టర్‌ను ఇప్పటికీ బయటపెట్టలేదు. తాము ఏ కేటగిరీలోని ఏ పోస్టుకు పోటీపడబోతున్నామో తెలుసుకొనే హక్కు అభ్యర్థులకు ఉండగా ఏపీపీఎస్సీ వాటిని చెప్పకపోవడం వివాదాలకు తావిస్తోంది.

### క్యారీఫార్వర్డ్ వివాదం..

2003 గ్రూప్-1 పోస్టులకు సంబంధించి క్యారీఫార్వర్డ్ విధానంలో ఖాళీ అయ్యే పోస్టులను మెరిట్ జాబితాలోని తదుపరి అభ్యర్థులతో భర్తీ చేయాలని సుప్రీంకోర్టు కొన్ని రోజుల కిందట తీర్పు ఇచ్చింది. దాని ప్రకారం 2003 నాన్‌జాయినింగ్ కింద 36 పోస్టులను 2011 గ్రూప్ 1 నోటిఫికేషన్ నుంచి(2003 గ్రూప్ 1 మెరిట్ అభ్యర్థులతో) భర్తీ చేస్తామని ఏపీపీఎస్సీ తాజా నోటిఫికేషన్లో పేర్కొంది. అప్పట్లో ఇంకా ఎవరైనా చేరకుండా ఉంటే ఆ పోస్టులను కూడా ఇందులోనే కలుపుతామని ప్రకటించింది. ఇదీ వివాదాస్పదమవుతోంది. 2003 నోటిఫికేషన్‌కు సంబంధించి సుప్రీం ఆదేశాలు పాటించాలని ఏపీపీఎస్సీ భావిస్తే ప్రభుత్వం ద్వారా సూపర్‌న్యూమరరీ పోస్టులను ఏర్పాటుచేయించాలే తప్ప నిరుద్యోగుల అవకాశాలను దెబ్బతీయడం సరికాదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### న్యాయవివాదాలకు అవకాశం..

2003 క్యారీఫార్వర్డ్ వల్ల ప్రస్తుతం 173 పోస్టుల సంఖ్య భారీగా తగ్గి కటాఫ్ పెరుగుతుంది. ఆరు ప్రశ్నలు తొలగించడం వల్ల కటాఫ్ తగ్గి కొత్తగా అర్హత సాధించిన 196 మంది కూడా అర్హత కోల్పోతారు. ఎవరిగురించయితే మెయిన్స్‌ను తిరిగి నిర్వహిస్తున్నారో వారే అనర్హులైనప్పుడు ఈ పరీక్ష ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. 2011 గ్రూప్1పై సుప్రీంకోర్టు తీర్పులో 312 పోస్టుల భర్తీపై క్యారీఫార్వర్డ్ గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. అలాంటప్పుడు కోర్టు అనుమతి లేకుండా పోస్టులను క్యారీఫార్వర్డ్ అంటూ కుదించడం మళ్లీ న్యాయవివాదాలకు దారితీసేదిగా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.